క్లుప్తంగా

వేడుకగా విగ్రహ ప్రతిష్ట



లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్

అట్లూరు : కుంబగిరి పంచాయితీ పరిధిలో నూతనంగా నిర్మించిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం నూతన విగ్రహ ప్రతిష్ట వేడుకగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్టతో పాటు ధ్వజ స్తంభారోహణ, కలశ ప్రతిష్ట, స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కల్యాణాన్ని తికించేందుకు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

ట్రాన్స్‌కో డీఈఈగా శ్రీకాంత్



మైదుకూరు : మైదుకూరు విద్యుత్ డివిజన్ డీఈఈగా శ్రీకాంత్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన వేంపల్లె డివిజన్ నుంచి మైదుకూరుకు బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న డీఈఈ శ్రీనివాసులురెడ్డి చిత్తూరుకు బదిలీ అయ్యారు.

పిల్లల గుర్తింపుపై సర్వే



మాట్లాడుతున్న ఐఈఆర్‌పీఎస్‌లు సంగీత, లక్ష్మిరెడ్డి

ప్రొద్దుటూరు రూరల్ : ఈనెల 13వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపుపై సర్వే నిర్వహిస్తున్నట్లు ఐఈఆర్‌పీఎస్‌లు సంగీత, లక్ష్మిరెడ్డి పేర్కొన్నారు. ఈ సర్వే ద్వారా ప్రత్యేక ఉపాధ్యాయులతో ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ఎన్‌రోల్‌మెంట్ చేయడంతోపాటు సెల్ఫ్ హెల్ప్ స్కిల్స్, ఫంక్షనల్ అకాడమిక్స్, వివిధ యాక్టివిటిస్‌లో శిక్షణ ఇస్తామన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ఇంటి వద్దనే ఉంచితే వారిలో శారీరక, మానసిక ఎదుగదల ఉండదని, భవిత కేంద్రంలో తప్పకుండా చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక ఎర్రగుంట్ల బైపాస్‌రోడ్డు సమీపంలోని సినీ హబ్ వద్ద బుధవారం గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. అతనికి సుమారు 60–65 ఏళ్లు ఉంటాయని వారు తెలిపారు. మృతుడి గురించి పరిసర ప్రాంత ప్రజలను విచారించినా అతని వివరాలు లభ్యం కాలేదు. ఎండ వేడిమికి తాళలేక అతను మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడికి సంబంధించిన బంధువులు ప్రొద్దుటూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ బాలమద్దిలేటి తెలిపారు.

బ్యాంకు ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని బ్యాంకు చైర్మన్‌ను భారతీయ మజ్దూర్ సంఘ్ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు పత్రికాపరంగా చైర్మన్‌కు విన్నవించారు. కంప్యూటర్ ఇంక్రిమెంట్ అరియర్స్ విషయంలో నాడు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఉద్యోగులకు జరిగిన అన్యాయం గురించి గతంలో పలుమార్లు మేనేజ్‌మెంట్ దృష్టికి తీసుకెళ్లినా ఒంటెద్దు పోకడల కారణంగా న్యాయం జరగలేదన్నారు. ప్రస్తుతం కొంతమంది రిటైర్స్ నుంచి అరియర్స్ ఎక్కువ ఇచ్చామని రికవరీ పెట్టారని, మరి తక్కువ ఇచ్చిన వాళ్ల సంగతి ఏమిటన్నారు. ఒకే బ్యాచ్‌లో చేరి ఒకేసారి ప్రమోషన్ పొందినపుడు అరియర్స్‌లో ఎందుకు తేడా వచ్చాయన్నారు. సీజీజీబీలో 1993 నవంబరు 1 నుంచి కంప్యూటర్ ఇంక్రిమెంట్ ఉన్నదని, అప్పటి పర్సనల్ డిపార్టుమెంటు స్టాఫ్‌తో ఆంధ్రప్రగతి స్టాఫ్ అరియర్స్‌తిరిగి మొదటి నుంచి క్యాలిక్యులేట్ చేసి అందరికీ న్యాయం చేయాలన్నారు.

ఎంసెట్ పరీక్ష నిర్వహణపై అవగాహన

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాలలో (అటానమస్) బుధవారం ఎంసెట్ మోడల్ కంప్యూటర్ పరీక్షను విద్యార్థులకు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ మోడల్ పరీక్షలో ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కళాశాల చైర్మన్ బి. శ్రీనివాసులు ఆధ్వర్యంలో శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాలలో గత నెల రోజులుగా ఉచితంగా ఎంసెట్ కోచింగ్‌తోపాటు ఉచిత బస్సు సౌకర్యాన్ని కలిపిస్తూ శిక్షణ తరగతులు కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులందరూ ఆన్‌లైన్ పరీక్షా విధానంపై అవగాహన పొందారని కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. కళాశాల ఏవో బాలక్రిష్ణ పర్యవేక్షణలో సివిల్ డిపార్టుమెంట్ విభాగాధిపతి నాగమల్లికార్జున ఆధ్వర్యంలో ఈ శిక్షణా తరగతులు జరిగాయి.

వెల్లాలలో వైభవంగా తిరుణాల



వెల్లాల తిరుణాలకు హాజరైన జనసందోహం



రథం వద్ద హోమం కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు

రాజుపాళెం : మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రథోత్సవం (తిరుణాల) అంగరంగ వైభవంగా జరిగింది. సాంప్రదాయ బద్ధంగా వేద పండితులు హోమం నిర్వహించి, పూజలు చేసి స్వామివారి రథంను దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ మల్లిఖార్జున ప్రసాద్, ఈఓ వెంకటరమణ, ఉత్సవ కమిటీ చైర్మన్ లక్ష్మినారాయణ రెడ్డి టెంకాయలు కొట్టి ప్రారంభించారు. ముందుగా తిరునాలకు వచ్చిన కొంతమంది భక్తులు తలనీలాలు సమర్పించి కుందూనదిలో స్నానాలు చేశారు. వివిధ రకాల బొమ్మల అంగళ్ల ఏర్పాటు చేయడంతో ఆలయం వద్ద నూతన శోభ సంతరించుకుంది. పెద్దసంఖ్యలో ఆయా గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వాములను దర్శించుకున్న అనంతరం పిల్లలతో కలిసి ఆనందంగా తిరిగారు. స్వాముల వారిని మాజీ జెడ్పీటీసీ మహేశ్వర రెడ్డి, పురుషోత్తం రెడ్డి, ట్రైనీ డీఎస్పీ భవాని, త్రీ టౌన్ సీఐ గోవింద రెడ్డి, ఎస్‌ఐ వెంకటరమణ, శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ రామమోహన్, ఆయా గ్రామాల్లోని భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. రథం వద్దకు కొంతమంది మహిళలు బోనాలు సమర్పించిన అనంతరం రథాన్ని ముందుకు కదిలించారు. అర్చకులు మాధవాచార్యులు, పట్టాభిరామన్, వెంకటా చలపతి, పవన్, శేషాచార్యులు పాల్గొన్నారు.

భక్తులకు మజ్జిగ, పానకం పంపిణీ..

తిరునాలకు వచ్చిన భక్తులకు అర్కటవేముల గ్రామానికి చెందిన సన్నపురెడ్డి మదన్‌మోహన్ రెడ్డి పానకం, మజ్జిగను పంపిణీ చేశారు. తిరునాలలో ఎటువంటి సమస్యలు జరగకుండా రాజుపాళెం ఎస్‌ఐ వెంకటరమణ తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

పండ్ల తోటల పెంపకం వలన అధిక లాభాలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ వీర కిషోర్

చాపాడు : పండ్ల తోటల పెంపకం వలన రైతులకు అధిక లాభాలు వస్తాయని మండల అభివృద్ధి అధికారి వీరకిషోర్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం హార్టికల్చర్ ప్లాంటేషన్‌పై ఉపాధి హామీ పథకం పీల్డు అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద 3 ఏళ్ల వరకూ నిర్వహణ ఖర్చులు చెల్లించడం జరుగుతుందన్నారు. ఎకరాపై గల రైతులు ఉద్యాన శాఖ ద్వారా 50 నుంచి 70 శాతం సబ్సిడీతో పంటలు సాగు చేసుకునేందుకు అవకాశం కలదన్నారు. మండల వ్యవసాయాధికారి మ్యాగీ మాట్లాడుతూ చాపాడు మండలంలో వరి పండించడం ఎక్కువగా జరుగుతోందని దీని వలన రైతు ఆశించిన మేర లాభాలు రావడం లేదన్నారు. ఉద్యాన పంటల వైపు రైతులు మొగ్గు చూపడం పట్ల అధిక లాభాలు వస్తాయన్నారు. ఇప్పటికే మండలంలో ఉద్యాన పంటలు సాగు చేసుకున్న రైతులు మంచి లాభాలు వస్తున్నాయన్నారు. రైతులు ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించేలా ఉపాధి సిబ్బంది గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీఓ జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలి

అట్లూరు : బ్రహ్మంగారిమఠంలో ఈతకు వెళ్లి మృత్యువాత పడిన విద్యార్థుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ చరణ్, పార్థు, హర్ష, దీక్షిత్, తరుణ్ కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.20 లక్షలు తక్షణ అందజేయాలన్నారు. ప్రతి ఏటా వేసవి సెలవుల్లో ఇలాంటి దుర్ఘటనల కారణంగా పిల్లలు ప్రాణాలు గాల్లో కలసి పోతున్నాయన్నారు. ప్రభుత్వం గ్రామాల సమీపంలో ఉండే చెరువులు, కుంటల చుట్టూ ముళ్ల కంచె ఏర్పాటు చేయాలని కోరారు.

19న గోపవరం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని గోపవరం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నికను ఈనెల 19న అధికారులు నిర్వహించనున్నారు. ఈ ఏడాది మార్చి 27న ఉప సర్పంచ్ ఎన్నికను అధికారులు నిర్వహించగా టీడీపీ దౌర్జన్యకాండ, ఆధిపత్య ధోరణితో ఎన్నిక నిలిచిపోయింది. ఈనెల 19న ఉదయం 11 గంటలకు ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించాలని డీపీఓ రాజ్యలక్ష్మి గోపవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి రామకృష్ణకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సారి అయినా ఉప సర్పంచ్ ఎన్నిక ప్రశాంతంగా సాగేందుకు పోలీసులు, జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారులు చర్యలు చేపడుతారా అని పలువురు గోపవరం గ్రామ పంచాయతీ ప్రజలు పేర్కొంటున్నారు.

నీతి మార్గం.. ఖ్యాతికి మూలం



విద్యార్థులకు నీతి కథలు బోధిస్తున్న డీకే చదువుల బాబు, గజ్జల వెంకటేశ్వరరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : నీతి మార్గం ఖ్యాతికి మూలం అని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డీకే చదువుల బాబు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గజ్జల వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక రామేశ్వరంలోని బాలబాలికల గ్రంథాలయ ఆధ్వర్యంలో వసంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరంలో ముఖ్య అతిథులుగా వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెట్లు, నదులు, గోవులు ఇతరులకు మేలు చేస్తున్నాయని, అదే మార్గంలో మనం అందరికి మేలు చేయాలని సూచించారు. విద్యార్థులకు నీతి కథలు, పద్యాలు వివరించారు. అనంతరం జిరాఫీ చెస్ కోచ్‌లు నాగార్జున, అరవింద్‌లు విద్యార్థులు జిరాఫీ చెస్, ఖోఖో, కబడ్డీ, షటిల్ ఆటలలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సుజాతమ్మ, ఉపాధ్యాయులు రవిశంకర్ రెడ్డి, సిబ్బంది రెహ్మాన్ ఖాన్, శారద, గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రాంసాహెబ్ పాల్గొన్నారు.

పాలిసెట్‌లో ఎస్‌వీ స్టడీ సర్కిల్‌కు స్టేట్ ర్యాంకులు

మైదుకూరు : ఇటీవల జరిగిన పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష (పాలిసెట్)లో మైదుకూరులోని ఎస్‌వీ స్టడీ సర్కిల్ విద్యార్థులకు రాష్ట్రస్థాయి ర్యాంకులు వచ్చినట్టు స్టడీ సర్కిల్ యజమాని జి.ప్రజాపతి తెలిపారు. స్టడీ సర్కిల్‌కు చెందిన ఎస్‌వీ కీర్తి 156వ ర్యాంక్, డి.స్వాతి 435వ ర్యాంక్, వైవీ సౌన్యం 971వ ర్యాంక్, ఏఎల్ నరసింహారెడ్డి 991వ ర్యాంక్ సాధించినట్టు ఆయన వివరించారు. తమ స్టడీ సర్కిల్‌కు చెందిన 20 మంది విద్యార్థులు 10వేల లోపు ర్యాంక్ సాధించినట్టు తెలిపారు.

పిల్లల కథా వర్క్‌షాప్‌ను విజయవంతం చేయండి



కథా వసంతం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక నందినీ క్లాత్ మార్కెట్‌లో ఉన్న జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో ఈనెల 24, 25 తేదీలలో రెండు రోజుల పాటు పిల్లల కథా వర్క్ షాప్‌ను 'కథా వసంతం 2025' పేరుతో నిర్వహిస్తామని, దీనిని విజయవంతం చేయాలని జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, ఉపాధ్యక్షుడు వేంపల్లి రాజశేఖర్ తెలిపారు. బుధవారం స్థానిక జేవీవీ కార్యాలయంలో కథా వసంతం పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల్లో కథల పట్ల ఆసక్తిని పెంచేందుకు, వారి రచనా నైపుణ్యాలను పెంచేందుకు ఈ వర్క్‌షాప్ ఎంతోగానో ఉపయోగపడుతుందన్నారు. 10 నుంచి 16 ఏళ్లలోపు ఉన్న పిల్లలకు ఈ కార్యక్రమంలో కథలు ఎలా రాయాలి, రాసే క్రమంలో అందులో ఏఏ అంశాలు ఉండాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి అనే అంశాలపై బాల సాహిత్య రచయితలు వారికి మెలకువలు తెలుపుతారని చెప్పారు. ఆసక్తి ఉన్న పిల్లలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కోరారు. వర్క్‌షాప్‌కు రాదలచిన పిల్లలు 9705432038, 9705333305 ఫోన్ నంబర్లకు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కవి మహమూద్, జేవీవీ జిల్లా గౌరవ సలహాదారుడు గోపినాథ్‌రెడ్డి, నాయకులు ఈశ్వరయ్య, మధుసూదన్‌రెడ్డి, దేవానంద్, శిరీష, హాసిని, జుబేదా, గురు చందన, సోయబ్, భరత్ నరసింహా, గురు తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు

వల్లూరు : మండలంలోని తప్పెట్ల బ్రిడ్జి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాబాఫక్రుద్దీన్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. దుగ్గాయపల్లె గ్రామ పంచాయతీలోని ధర్మాపురం కాలనీకి చెందిన బాబాఫక్రుద్దీన్ ద్విచక్ర వాహనంలో కడప కు వెళుతుండగా కడప వైపు నుంచి వస్తున్న లారీ తప్పెట్ల బ్రిడ్జి వద్ద యువకుడి కాళ్లపై ఎక్కడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు బాధితుడిని కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పెద్ద ఓబన్న తెలిపారు.

అంబేడ్కర్ సర్కిల్‌గా నామకరణం చేయాలి



మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్, మాల మహానాడు నాయకులు

మైదుకూరు : పట్టణంలోని కడప రోడ్డులో బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఉన్న ప్రాంతాన్ని అంబేడ్కర్ సర్కిల్‌గా నామకరణం చేయాలని ఎమ్మార్పీఎస్, మాల మహానాడు, పలు ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఆ మేరకు బుధవారం వారు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. అంబేడ్కర్ విగ్రహం ఉన్న ప్రాంతం పలు ప్రభుత్వ కార్యాలయాలకు మధ్యలో ఉందని అందువల్ల ఆ ప్రాంతాన్ని అంబేడ్కర్ సర్కిల్‌గా నామకరణం చేస్తే బాగుంటుందని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

వల్లూరు : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వల్లూరు, కమలాపురం ఎస్‌ఐలు పెద్దఓబన్న, విద్యాసాగర్ హెచ్చరించారు. మండలంలోని గణేష్‌పురం, వల్లూరు ఎస్సీ కాలనీల్లో బుధవారం వారు నాకా బందీ నిర్వహించారు. అనంతరం స్థానికులతో సమావేశం ఏర్పాటు చేసి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. గృహాల్లో దొంగతనాల నిరోధానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి అవగాహన కల్పించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



ఆలయంలో మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

కమలాపురం : మండలంలోని రామాపురంలో వెలసిన మోక్ష నారాయణస్వామి ఆలయంలో ఈనెల 10వ తేదీ నుంచి జరుగుతున్న బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. వేద పండితులు ఘనాపాటి వంశీకృష్ణ ఆచారత్వమున ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం అర్చనలు, సర్వసూక్త పారాయణం, సమస్త పరివార దేవతా మూర్తుల హోమాలు మహా పూర్ణాహుతి, మహా కుంభాభిషేకం, చక్రస్నానం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం మోక్ష నారాయణుడు గరుడ వాహనంపై, సుబ్రహ్మణ్యస్వామి మయూర వాహనంపై మాడ వీధులతో ఊరేగారు. మహిళల కోలాటం, చెక్క భజన భక్తులను అలరించాయి.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

మండలంలోని రామాపురంలో జరుగుతున్న మోక్ష నారాయణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 5 జతల కాండ్లు రాతి దూలాన్ని ఈడ్చాయి. గెలుపొందిన విజేతలకు వరుసగా రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.5వేల నగదు బహుమతులను అందజేశారు. అలాగే శ్రీ మోక్షనారాయణస్వామికి మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మోక్షనారాయణస్వామి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు బుధవారం మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఆయన సతీమణి ప్రభావతమ్మ, ఆర్టీసీ జోనల్ మాజీ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డిలకు నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఆలయ వ్యవస్థాపకులు సత్య సాయినాథ శర్మ వారికి శాలువ కప్పి, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా రేణుకా ఎల్లమాంబ కల్యాణం



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

సిద్దవటం : మండలంలోని మాచుపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రేణుకా యల్లమాంబ కల్యాణం బుధవారం వైభవోపేతంగా జరిగింది. అమ్మవారి తిరునాల సందర్భంగా బుధవారం సాయంత్రం చెన్నూరు మండలం శేషన్నగారిపల్లె గ్రామానికి చెందిన అనుగోలు చిన్న ఎల్లయ్య కుమారులు అనుగోలు మల్లికార్జున, ఎల్లప్రసాద్‌ల ఆధ్వర్యంలో శ్రీ జగజ్జనని శ్రీ రేణుకా ఎల్లమాంబ సమేత జమదగ్ని మహారాజు ఉత్సవమూర్తులకు వేదపండితులు రంగసముంద్ర మల్లికార్జునశర్మ, ప్రదీప్‌శర్మలు మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణ క్రతువును జరిపారు. గ్రామ ప్రజలతో పాటు జిల్లా నలుమూల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారి మూల విరాట్‌ను దర్శించుకొని కాయా కర్పూరాలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

• భక్తిశ్రద్ధలతో పవళింపు సేవ



పవళింపు సేవలో అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి దేవి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీఅగస్త్యేశ్వర స్వామి ఆలయంలో బుధవారం రాత్రి స్వామివారికి పవళింపు సేవ నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం అగస్త్యేశ్వర స్వామి, రాజరాజేశ్వరి దేవి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి పవళింపు సేవను వేద పండుతులు శాస్త్రోక్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా గురువారం శాంతి ఉత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

బండలాగుడు పోటీల్లో చౌటపల్లె ఎడ్లు ఫస్ట్

రాజుపాళెం : రాజుపాళెం మండలంలోని వెల్లాలలో శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం సాయంత్రం నిర్వహించిన రాష్ట్రస్థాయి సీనియర్ వృషభరాజముల బండలాగుడు పోటీల్లో ప్రొద్దుటూరు మండలం చౌటపల్లె గ్రామానికి చెందిన మార్తల చంద్ర ఓబుళరెడ్డి ఎడ్లు 3527 అడుగులు లాగి మొదటి స్థానంలో నిలిచాయి. ఆ ఎడ్ల యజమానికి ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మినారాయణ రెడ్డి రూ.లక్ష పదకొండు వేలు నగదును అందించారు. ఈ పోటీలను ప్రొద్దుటూరు మండల మాజీ ఎంపీపీ రాఘవ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మహేశ్వర రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మినారాయణ రెడ్డిలు ప్రారంభించారు. ఇందులో మొత్తం ఐదు జతల ఎడ్లు పాల్గొన్నాయి. ఈపోటీలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో ఆయా గ్రామ ప్రజలు, మహిళలు, పిల్లలు వచ్చారు. తెలంగాణ రాష్ట్రం హుజూర్ నగర్ బోరెడ్డి కేశవరెడ్డి, సుంకి సురేందర్ రెడ్డి ఎడ్లు 3499 అడుగులు లాగి రెండవ స్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా సిరివెళ్ల మండలం గుంపురమానుదిన్నెకు చెందిన కుందురు రాం భూపాల్ రెడ్డి ఎడ్లు 2941 అడుగులు లాగి మూడో స్థానంలో, ఖాజీపేట మండలం పత్తూరు కవ్వ బాలయ్య ఎడ్లు 1543 అడులు లాగి నాల్గవ స్థానంలో, నంద్యాల జిల్లా సిరివెళ్ల మండలం ఇసుకపల్లె సిద్ధయ్య ఎడ్లు 1500 అడుగుల లాగి ఐదవ స్థానంలో నిలిచాయి. వారికి వరుసగా రూ.75వేలు, రూ.50వేలు, రూ.30వేలు, రూ.20వేలు ఆయా ఎడ్ల యజామనులకు నగదు బహుమతులు అందించారు. రాజుపాళెం ఎస్‌ఐ వెంకటరమణ తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



స్వామివారికి హారతి ఇస్తున్న ఎమ్మెల్సీ దంపతులు

అట్లూరు : ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి అన్నారు. బుధవారం పోరుమామిళ్లలోని రంగముద్రం పంచాయితీలోని టీటీడీ కల్యాణ మంటపం సమీపంలో వెలసిన శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి దశమ వార్షికోత్సవంలో డీసీ గోవిందరెడ్డి, ఆయన సతీమణి తులశమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి గోవిందరెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్సీతో పాటు ఆయన సతీమణి తులశమ్మను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బూతు కన్వీనర్ల సమన్వయకర్త రమణారెడ్డి, రంగసముద్రం ఉప సర్పంచ్ రుద్రవరం ప్రసాద్, జగన్‌మోహన్ ఆచారి, శ్రీనివాసులు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం



మాట్లాడుతున్న ఏపీఓ రవీంద్రారెడ్డి

అట్లూరు : పండ్ల తోటలు సాగు చేసే చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఓ రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. పోరుమామిళ్ల మండల స్త్రీశక్తి భవనంలో బుధవారం ఎంపీడీఓ రమణారెడ్డి, మండల వ్యవసాయశాఖాధికారి వరహరి కుమార్ ఆధ్వర్యంలో పండ్ల తోటల పెంపకంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండ్ల తోటలు పెంపకానికి ప్రభుత్వం వందశాతం సబ్సిడీ అందిస్తుందని తెలిపారు. పండ్ల తోటలు పెంచుకోవాలనే ఆసక్తి కలిగిన చిన్న, సన్న కారు రైతులను గుర్తించేందుకు ఈ నెల 16వ తేదీన అన్ని సచివాలయాలలో గ్రామ సభలు నిర్వహిస్తామని తెలిపారు. అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీ ఖాజా, వ్యవసాయ, ఉద్యానశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరిన ఇంటి దీపం

తరుణ్ అంత్యక్రియలు పూర్తి

శోక సంద్రంలో తల్లిదండ్రులు



తరుణ్ (ఫైల్)



తరుణ్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న విశ్వనాథరెడ్డి

కాశినాయన : ఆటపాటలతో ఆనందంగా గడపాల్సిన సెలవుల్లో విషాదఛాయలు అలముకున్నాయి. కన్నవారికి జీవితాంతం చెరగని చేదు జ్ఞాపకాలు మిగిలిపోయాయి. మండలంలోని కె.ఎస్.కొట్టాల గ్రామానికి చెందిన గంగమాసు నారాయణ మహాలక్షుమ్మ దంపతులకు ఏకైక కుమారుడైన తరుణ్ (13) అమ్మమ్మ గ్రామమైన మల్లెపల్లెకు వెళ్లారు. అక్కడ స్నేహితులతో కలసి చెరువులో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు గల్లంతయ్యారు. ఇతనితో పాటి మరో నలుగురు విద్యార్థులు గల్లంతయ్యారు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటలకు బి.మఠం పోలీసులు చెరువు దగ్గరకు చేరుకుని మృతదేహాలను వెతికి బయటికి తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అయిన తరువాత బుదవారం తరుణ్ మృతదేహాన్ని స్వగ్రామమైన కె.ఎస్ కొట్టాలకు తీసుకుని వచ్చారు. మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు, బంధువులతో పాటు గ్రామస్తుల రోదనలు మిన్నటాయి. బద్వేలు నియోజకవర్గ వైయస్సార్‌సీపీ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథరెడ్డి, జెడ్పీటీసీ సత్యనారాయణరెడ్డి బాలుని మృత దేహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు.

బాలుడి అంత్యక్రియల్లో ఎమ్మెల్యే

బ్రహ్మంగారిమఠం : మండలంలోని మల్లేపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మేకల రత్నకుమార్ యాదవ్‌గంగాధర్ మనుమడు తరుణ్(10) మంగళవారం సాయంత్రం ఈతకు వెళ్లి మృతి చెందిన విషయం విదితమే. బుధవారం బాలుడు భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి బాలుడి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. జడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి, ఎంపీపీ వీరనారాయణరెడ్డి, ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డిలు అంత్యక్రియల్లో పాల్గొని బాలుడి కుటుంబీకులను పరామమర్శించారు.



బాలుడి మృతి దేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు